ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 తమిళనాడు TAMILNADU

ఆదివారం 9 జూన్ 2024





పాఠశాల వద్ద ఫాగింగ్ యంత్రంతో దోమల మందు చల్లుతున్న కార్మికుడు



తేనాంపేటలోని పాఠశాలలో తరగతి గదిని శుభ్రం చేస్తున్న సిబ్బంది



స్టేషనరీ వస్తువులను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న ఉపాధ్యాయులు



ప్రైవేటు పాఠశాల బస్సును పరిశీలిస్తున్న ఆర్టీవో అధికారులు, పోలీసులు

రేపే బడి గంటల మోత

స్కూళ్లలో పారిశుధ్య పనులు ● స్టేషనరీ షాపుల్లో పెరిగిన రద్దీ

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభవుతున్న సందర్భంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రభుత్వ పాఠ్యపుస్తకాల సంస్థ పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను, స్టేషనరీలను ఆయా పాఠశాలలకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. నగరంలోని కార్పొరేషన్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌండర్, ఫినాయిల్ చల్లి ప్రాంగణాలను శుభ్రం చేస్తున్నారు. తరగతి గదులలలోని బల్లలను శుభ్రపరచి గోడలకు సున్నం వేస్తున్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు స్కూలు బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రీబాక్స్‌లు కొనేందుకు స్టేషనరీ దుకాణాల వద్ద బారులుతీరారు. నగరంలోని ప్యారీస్ కార్నర్, పురుషవాక్కం, మైలాపూరు, రాయపేట తదితర ప్రాంతాల్లోని స్టేషనరీ దుకాణాలలో ప్రస్తుతం పుస్తకాల అట్టకు ఉపయోగించే బ్రౌన్‌షీట్లు, కత్తెరలు, లేబుల్స్, పెన్నులు, పెన్సిళ్ల అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. ఇదే విధంగా స్కూలు బ్యాగులు, బూట్లు విక్రయించే షాపుల వద్ద విద్యార్థుల తల్లులు తమ పిల్లలకు నచ్చిన బ్యాగులు బూట్లు కొనుగోలు చేస్తున్నారు. ఇదే రీతిలో విద్యార్థులు తమ స్నేహితులతో కలిసి స్టేషనరీ దుకాణాలకు వెళ్ళి జామెట్రీబాక్సులు, కత్తెరలు, రబ్బర్లు కొంటున్నారు. దీనితో నగరంలోని స్టేషనరీ దుకాణాలన్నీ కొనుగోలు దార్లతో కిటకిటలాడుతున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు స్కూళ్ల వ్యాన్‌లు నడిపే డ్రైవర్లు, క్లీనర్‌లకు అగ్నిమాపక దళం అధికారులు ప్రాథమిక చికిత్సలపై శిక్షణలందిస్తున్నారు. ఆర్టీవో అధికారులు, పోలీసులు స్కూలు వ్యాన్‌లను తనిఖీ చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు.





పెన్సిళ్లు, పెన్నులు ఎంపిక చేస్తున్న చిన్నారులు - ప్లాస్టిక్ బాక్సులు కొంటున్న విద్యార్థినులు

అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీతో పొత్తు పెట్టుకోం : ఈపీఎస్

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళని స్వామి (ఈపీఎస్) స్పష్టం చేశారు. సేలం జిల్లా ఓమలూరులో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓటు బ్యాంక్ పెరిగిందే తప్ప తగ్గలేదని, పార్టీపరంగా ఎంపీలుగా ఎవరూ గెలవకపోయినా, అసెంబ్లీ ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో నిరూపిస్తామన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకుని ఉంటే అన్నాడీఎంకే కొన్ని చోట్లలో గెలిచేదని బీజేపీ నేతలు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ గెలుపుకోసం ప్రధాని మోదీ, హోంమంతి అమిత్‌షా తదితర నాయకులంతా రాష్ట్రంలో ప్రచారం చేసినా ఒక్క సీటు కూడా ఆ పార్టీ గెలుచుకోలేకపోయిందన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల కంటే 2024 ఎన్నికల్లో బీజేపీ తక్కువ శాతం ఓట్లు పొందిందని చెప్పారు. ఓ వైపు డీఎంకే కూటమి, మరోవైపు బీజేపీ కూటమి అంటూ రెండు బలమైన కూటములకు ధీటుగా అన్నాడీఎంకే కూటమి ఎన్నికల బరిలోకి దిగి ఓటు బ్యాంక్‌ను గణనీయంగా పెంచుకుందని ఆయన చెప్పారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘనవిజయం సాధించి మళ్ళీ అధికారంలో రావటం తథ్యమని ఈపీఎస్ జోస్యం చెప్పారు. దక్షిణాది జిల్లాల్లో పార్టీకి ఓటు బ్యాంక్ తగ్గటంపై త్వరలో తాను సమీక్ష జరిపి తగు చర్యలు చేపడతానని చెప్పారు. ఈ ఎన్నికలలో ఓడినంత మాత్రానికే అన్నాడీఎంకేకు మనుగడలేదని ప్రత్యర్థులు దుష్ప్రచారం చేయడం గర్హనీయమని చెప్పారు. 1992లో డీఎంకే 2 లోక్‌సభస్థానాల్లో, 1996లో అన్నాడీఎంకే 4 లోక్‌సభ స్థానాల్లో గెలిచిందని, అంతమాత్రానికే రెండు పార్టీలు పత్తా లేకుండా పోయాయా అని ఈపీఎస్ ప్రశ్నించారు. పార్టీ నుంచి వైదొలగినివారినందరినీ మళ్ళీ చేర్చుకోవాలంటూ తమ పార్టీలో ఉన్న ప్రముఖులెవరూ ప్రతిపాదించలేదని, ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన ఓపీఎస్, దినకరన్ లాంటి నాయకులే ప్రతిపాదిస్తున్నారని, వారి మాటలను పట్టించుకోవాల్సిన అవసరమే లేదన్నారు. పార్టీలో అయోమయం సృష్టించేందుకే విడిపోయిన వర్గాల విలీనం అంటూ ప్రచారం చేస్తున్నారని ఈపీఎస్ పేర్కొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

నేడు టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్ష

6,244 పోస్టులకు 20 లక్షల మంది పోటీ

పెరంబూర్, జూన్ 8: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం గ్రూప్-4 పరీక్ష జరుగనుంది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరక పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే హాజరుకావాలని అభ్యర్థులకు టీఎన్‌పీఎస్సీ సూచించింది. గ్రామ నిర్వహణ అధికారి, అటవీ సిబ్బంది, బిల్ కలెక్టర్, ఆవిన్ కార్యాలయ అసిస్టెంట్, సహకార సంఘాల సూపరింటెండెంట్ సహా పలు శాఖల్లో ఖాళీగా ఉన్న 6,244 పోస్టులను భర్తీచేసేలా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) గత జనవరి 30వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ ప్రకారం, ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ జనవరి 30వ తేది ప్రారంభమై ఫిబ్రవరి 28వ తేదీతో ముగిసింది. గ్రూప్-4 పోస్టులకు కనీస విద్యార్హత 10వ తరగతి అయినా, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంఫిల్ తదితర ఉన్నత విద్యను పూర్తి చేసిన వారు మొత్తం 20 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ ప్రకారం, ఒక పోస్టుకు 320మంది దరఖాస్తు సమర్పించారు. ఈ పరీక్షలో జనరల్ తమిళం నుంచి 100 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్, మేధస్సు నైపుణ్యానికి సంబంధించి 100 ప్రశ్నలు అని మొత్తం 200 ప్రశ్నలతో ప్రశ్నాపత్రం ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒకటిన్నర మార్కులు అని మొత్తం 200 ప్రశ్నలకు 300 మార్కులతో ప్రశ్నాపత్రం రూపొందించారు. ఈ పరీక్షా ఫలితాలు 2025 జనవరిలో విడుదల కానున్నాయి. ప్రస్తుతం 6,244 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించినా, భర్తీ రోజుకు ఈ సంఖ్య 10,000 వేలకు చేరుకొనే అవకాశముందని ప్రభుత్వ వర్గాల సమాచారం. ఇంటర్వ్యూ లేకపోవడంతో, పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

నీట్ రద్దు కోసం
గళమెత్తండి!

డీఎంకే ఎంపీలకు స్టాలిన్ ఆదేశం



డీఎంకే ఎంపీల సమావేశం వేదికపై స్టాలిన్, ఇతర నాయకులు

ప్యారీస్, జూన్ 8 : నీట్ పరీక్షల రద్దు వ్యవహారంపై పార్లమెంట్ సమావేశాల్లో గళమెత్తాలని డీఎంకే కొత్త ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాలిచ్చారు. స్థానిక తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో శనివారం సాయంత్రం స్టాలిన్ అధ్యక్షతన ఎంపీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, డిప్యూటీ కార్యదర్శి కనిమొళి, సీనియర్ మంత్రి పొన్ముడి, ఎంపీ ఎ. రాజా, పార్టీ సీనియర్ నేత ఆర్ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు. సుమారు అరగంటసేపు కొనసాగిన ఈ సమావేశంలో ప్రస్తుత జాతీయ స్థాయి రాజకీయ పరిస్థితులు గురించి, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు ఉత్సవాల నిర్వహణ, 40 లోక్‌సభ నియోజకవర్గాలలో విజయోత్సవాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలువురు విద్యార్థులను బలిగొన్న నీట్ పరీక్షల రద్దు వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా ఎన్డీయే పక్ష నేతలు చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌లను సంప్రదించి వినతిపత్రం సమర్పించాలని తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో తొలగించిన జాతీయ నాయకుల విగ్రహాలను మళ్ళీ అదే స్థానాల్లో ప్రతిష్ఠించేలా ఎంపీలు తీవ్ర ప్రయత్నాలు సాగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మొత్తం ఐదు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా ఈ నెల 14న కోయంబత్తూరులో కలైంజర్ శతజయంతి ముగింపు వేడుకలను కోలాహలంగా నిర్వహించాలని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ఓ తీర్మానంలో ప్రతిపాదించారు.

టీఎంకే అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీ

విజయ్ నిర్ణయం



టీఎంకే నేత విజయ్, ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలలోపు పార్టీని విస్తరింపజేయడానికిగాను ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని తమిళగ వెట్రి కళగం నాయకుడు, తమిళ సినీ హీరో విజయ్ నిర్ణయించారు. ఈ నెల 18న పనయూరులో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ నాయకత్వంలో జరగనున్న పార్టీ నిర్వాహకుల సమావేశంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటుపై సమగ్ర చర్చలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో విజయ్ జన్మదిన వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలు గురించి, వచ్చే శాసనసభ ఎన్నికలలోపు పార్టీని అభివృద్ధి చేయటం గురించి విస్తృతంగా చర్చలు జరుపనున్నారు. పార్టీకి అన్ని జిల్లాల్లో కొత్త కార్యవర్గాలను ఏర్పాటు చేసే విషయంపై కూడా తగు నిర్ణయాలు తీసుకుంటారని తెలుస్తోంది.

పదిమందికి అన్నం పెట్టిన తెలుగు మనిషి

రామోజీ రావు సేవలు మరువలేనివి ● నగరంలోని తెలుగు ప్రముఖుల సంతాపం







రామోజీ రావుతో ఎం.శ్రీనివాసరావు (ఫైల్‌ఫోటో) - రామోజీ రావుతో కేతిరెడ్డి జగదీశ్వర రెడ్డి - రామోజీ రావుతో టంగుటూరి రామకృష్ణ

అడయార్, జూన్ 8: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీ రావు మృతిపై నగరంలోని అనేక మంది తెలుగు ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. మంచి తెలుగు మనిషి, మంచిని ప్రోత్సహించే వ్యక్తి, పది మందికి అన్నం పెట్టిన తెలుగు మనిషి, తెలుగు భాష అంటే వల్లమాలిన ప్రేమ కలిగిన భాషాభిమాని అంటూ ఆయన గురించి స్మరించుకున్నారు. ఇదే విషయంపై పలువురు వివిధ ప్రముఖులు శనివారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లోని సారాంశాన్ని పరిశీలిస్తే,

ఆ విందు ఏర్పాటు మరువలేనిది

రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వారు నిర్మించిన ఫిల్మ్ సిటీ వారి కళాత్మక అభిరుచికి నిదర్శనం. పత్రిక, టీవీ, సినీ రంగానికి ఆయన చేసిన సేవలు అసమానం. సుమారు 40 యేళ్ళ క్రితం ఆయన బంధువు అట్లూరి రామారావుకు ఒక ఆపరేషన్ నిమిత్తం నన్ను హైదరాబాద్‌కు పిలిపించారు. ఆ రోజు సాయంత్రం నా గౌరవార్థం వారి ఇంట్లో ఏర్పాటు చేసిన విందు నేటికీ మరువలేనిది. అప్పటి నుంచి మా స్నేహం కొనసాగుతోంది. వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

- ఏఐటీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి

తెలుగు వారికి తీరని లోటు

స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న వ్యక్తి. పత్రికా, పర్యాటక రంగాలు, ఆహార ఉత్పత్తులు, చిట్‌ఫండ్ వ్యాపారంలో తనదైనశైలిలో ముద్రవేశారు. ప్రపంచంలో అతిపెద్దదైన రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించారు. వివిధ రంగాలతో తనదైన ముద్ర వేసిన రామోజీరావు ఇక లేరని వార్త తెలుగు వారికి తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి, సంతాపం.

- ద్రావిడ దేశం కృష్ణారావు

తెలుగు భాషా ప్రేమికుడు

రామోజీరావు మరణం తెలుగు ప్రజలకు తీరనిలోటు. ఆయన తెలుగు భాషా అభిమాని. తెలుగు భాష పట్ల ఆయన చూపిన ప్రేమ ఎన్నటికీ మరువలేనిది. నిర్మాతగా 60కి పైగా చిత్రాల్లో నిర్మించారు. రామోజీ ఫిల్మ్ సిటీని నిర్మించి దేశంలోనే అగ్రగామిగా నిలిచారు. ఈ స్టూడియో నిర్మాణంతో లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి.

- తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి

తెలుగు భాష అంటే వల్లమాని ప్రేమ

మంచిని ప్రోత్సహించే తెలుగు మనిషి, పదిమందికి అన్నం పెట్టిన తెలుగు మనిషి, తెలుగు భాష అంటే వల్లమాని ప్రేమ. పక్షపాతంలేని జర్నలిజాన్ని ఆచరణలో పెట్టిన మీడియా మొఘల్. పద్మవిభూషణ్ రామోజీ రావు తెలుగు ప్రజలకు చేసిన సేవలు, మేలు మాటల్లో వర్ణించలేనిది. ఆయన పేరు తెలుగు భాష ఉన్నంతకాలం స్థిరస్థాయిగా నిలిచివుంటుంది. ఒత్తిడికి తలొగ్గని నైజం ఆయన సొంతం. బెదిరింపులకు భయపడని ధీరత్వం ఆయన సొంతం.

- టీటీడీ ఎల్ఏసీ మాజీ సభ్యుడు ఎం.శ్రీనివాసరావు

రామోజీ రావు ధైర్యవంతుడు

రామోజీరావు లేరన్న వార్త తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆయన వ్యక్తిగతంగా నాకు తెలుసు. చాలా బలవంతుడు. ధైర్యవంతుడు. ఎంత మర్యాదస్తుడు. సింపుల్ అండ్ గ్రేట్ పర్సన్, భారతదేశ మీడియా, స్టూడియో, వ్యాపార రంగాల్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన గొప్ప వ్యక్తి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను.

- వామ్ గ్లోబల్ ప్రెసిడెంట్ టంగుటూరి రామకృష్ణ

సమాచార దర్శిని

16న యోగాథాన్ పోటీలు

ఐసిఎఫ్, జూన్ 8: ప్రపంచ యోగా దినాన్ని పురస్కరించుకొని ఈ నెల 16వ తేది స్థానిక నెహ్రూ ఇండోర్ స్టేడియంలో యోగథాన్ పోటీలు జరుగనున్నాయి. సూర్య నమస్కారంలోని 12 ఆసనాలు ఒక రౌండ్‌గా లెక్కించి, 30,50,108,200 అనే రౌండ్లతో యోగథాన్ పోటీలు ఉదయం 8.30 గంటలకు ప్రారం భం కానున్నాయి. పోటీల్లో పాల్గొని రౌండ్లు పూర్తిచేసిన వారికి పతకాలు, సర్టిఫికేట్లు అందజేయనున్నా రు. ఆసక్తి ఉన్న వారు 13వ తేదిలోపు పేరు నమోదుచేసుకోవచ్చు. ఇతర వివరాలకు 9840112000 అనే నెంబరు సంప్రదించవచ్చు.

27 నుంచి బాక్సింగ్ పోటీలు

ఐసిఎఫ్, జూన్ 8: తమిళనాడు బాక్సింగ్ సంఘం, చెన్నై అమెచ్యూర్ బాక్సింగ్ సంఘం సంయుక్తంగా రాష్ట్ర ఓపెన్ బాక్సింగ్ పోటీలను స్థానిక చెట్‌పెట్ నెహ్రూ పార్కులో ఉన్న వేదికలో నిర్వహించనున్నాయి. ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు జరిగే ఈ పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, యూత్, సీనియర్ విభాగాల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదిలోపు 9884675848, 79049 16116 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

26న రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ఐసిఎఫ్, జూన్ 8: రాష్ట్ర చెస్ సమాఖ్య సహకారంతో జీఎం చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బాలబాలికల రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఈ నెల 26వ తేది జరుగనున్నాయి. 8 ఏళ్లలోపున్న విభాగంలో పాల్గొనే క్రీడాకారులకు పతకాలు అందజేస్తారు. ఇతర విభాగాల్లో మొదటి 20 స్థానాలు సాధించే క్రీడాకారులకు ట్రోఫీ, సర్టిఫికేట్ అందజేస్తారు. స్థానిక తాంబరం చెంబాక్కం ఆల్ఫా ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9941514097 అనె నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలి.

రేపటి నుంచి ఉచిత కబడ్డీ శిక్షణ

ఐసిఎఫ్, జూన్ 8: స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న ఎస్సార్ఎం, తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్శిటీ ఆధ్వర్యంలో వేసవికాల ఉచిత కబడ్డీ శిక్షణా శిబిరం ఈ నెల 10వ తేది ప్రారంభం కానుంది. కోవలంలో ఉన్న సెయింట్ జోసఫ్ మహోన్నత పాఠశాలలో జరిగే ఈ శిక్షణలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహికులు 70945183 26 నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలి.

ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 8: ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం కోర్సుల అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ శనివారం ప్రారంభమైంది. అన్నా విశ్వవిద్యాలయం ఆధీనంలో పనిచేస్తున్న 400లకు పైగా ఇంజనీరింగ్ కళాశాలల్లో బీఈ, బీటెక్ తదితర కోర్సుల్లో 2 లక్షలకు పైగా సీట్లున్నాయి. ఈ విద్యాసంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 6వ తేదీతో ముగియగా, 2,49,918 మంది దరఖాస్తు సమర్పించారు. ఈ నేపథ్యంలో, రెండవ సంవత్సరంలో నేరుగా విద్యార్థుల ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ఆదివారం ప్రారంభమైంది. పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు టీఈటీఏజెజ్బ్స్.ఛౌరు అనే వెబ్‌సైట్‌లో జూలై 7వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని వర్శిటీ ప్రకటన విడుదల చేసింది.

రాష్ట్రంలో 5 లక్షల మంది నిరక్షరాస్యులు

ఐసిఎఫ్, జూన్ 8: రాష్ట్రంలో 5 లక్షల మంది నిరక్షరాస్యులున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18ఏళ్ల పైబడిన వారిలో రాయడం, చదవడం తెలియని వారికి సంబంధించి పాఠశాల విద్యాశాఖ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో అ, ఆ, ఇ,ఈలు రానివారిని గుర్తించి, వారికి చదవడం, రాయడంపై శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. గత ఏడాది జరిగిన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల మంది నిరక్షరాస్యులుండగా, చెన్నైలో 11,869 మంది, గరిష్టంగా సేలం జిల్లాలో 40,191 మంది తమిళం చదవడం, రాయడం తెలియకుండా ఉన్నారు. మరో రెండేళ్లలో నిరక్షరాస్యులు లేని జిల్లాలుగా అన్ని జిల్లాలను మార్చేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

కంప్యూటర్ అసిస్టెంట్లకు వేతన పెంపు

ఐసిఎఫ్, జూన్ 8: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకంలో పనిచేసే కంప్యూటర్ల అసిస్టెంట్ల వేతనం పెరిగింది. రాష్ట్రంలోని గ్రామీ ణ స్థానిక సంస్థల్లో ఈ పథకం అమలులో ఉంది. 1,843 కంప్యూటర్ అసిస్టెంట్లు నెలకు రూ.16,000 వేతనంతో పనిచేస్తున్నారు.వారి వేతనాన్ని పెంచాలని కోరుతూ గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ లేఖను పరిశీలించిన ప్రభు త్వం, వారి వేతనాన్ని రూ.20,000 పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది.

ఆధార్ పరిశీలనకు 45 బయోమెట్రిక్ పరికరాలు

ఐసిఎఫ్, జూన్ 8: అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డుల్లో కార్మికుల ఆధార్ నెంబర్లు పరిశీలించేందుకు 45 బయోమెట్రిక్ పరికరాలు కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ బోర్డుల్లో 44.09 లక్షల మంది కార్మికులు సభ్యత్వం కలిగి ఉన్నారు. వారి పేర్ల నమోదుకు 5సర్వర్లు వినియోగిస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో సాంకేతికలోపం కారణంగా సర్వర్లు పనిచేయలేదు.వాటిని సరిచేసిన అనంతరం అదే నెల 25వ తేది నుంచి మళ్లీ పనిచేయడం ప్రారంభించాయి.ఈ నేపథ్యంలో, ఈ-సేవా కేంద్రాల్లో ఉచితంగా కార్మికుల దస్తావేజులను బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌చేసేందుకు చర్యలు చేపట్టారు. అప్‌లోడ్ పనులకు కార్మికుల నుంచి ఓటీపీ విధానం తొలగించి ఆధార్ నెంబరు పరిశీలనకు 45 బయోమెట్రిక్ పరికరాలు కొనుగోలు చేశారు.

36 రైళ్లు రద్దు

ఐసిఎఫ్, జూన్ 8: జైపూర్ సహా 36 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. తెలంగాణా రాష్ట్రం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో రైల్వే లైన్ అభివృద్ధి పనులు జరుగనుండడంతో ఆ మార్గంలో వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్లో మార్పులు చేపట్టారు. చెన్నై సెంట్రల్-జైపూర్ సాయంత్రం 5.40 గంటల ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 23,25,30, జూలై 2,7 తేదీల్లో రద్దు కానుంది. జైపూర్-సెంట్రల్ రాత్రి 7.35 గంటల రైలు ఈనెల 21,23,28,30, జూలై 5వ తేదీల్లో రద్దు కానుంది. ఇదే విధంగా లక్నో-యశ్వంత్‌పూర్, పాట్నా-ఎస్ఎంవీటీ బెంగుళూరు, బిలాస్‌పూర్-తిరునల్వేలి, భగత్ కి కోఠి-మన్నార్‌గుడి, మదురై-బికానీర్, మదురై-జబల్‌పూర్, దానాపూర్-ఎస్ఎంవీటీ బెంగుళూరు సహా 36 రైళ్ల సేవలు రద్దు కానున్నాయని దక్షిణ రైల్వే తెలిపింది.

రేపటి నుంచి ఆళియారు డ్యాం నీటి విడుదల

పెరంబూర్, జూన్ 8: ఆళియారు డ్యాం నుంచి సాగ కోసం ఈ నెల 10వ తేది నుంచి నీటిని విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కోయంబత్తూర్ జిల్లా ఆళియారు పాత ఆయకట్టు సాగు ప్రాంతంలోని 6,400 ఎకరాలు లబ్దిపొందేలా ఈ నెల 10 నుంచి అక్టోబరు 24వ తేది వరకు నీరు విడుదల చేయనున్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని రాష్ట్రప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

70.67 లక్షల మంది విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు



పెరంబూర్, జూన్ 8: రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 70.67 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, 60.75 లక్షల మంది ఉచిత నోటు పుస్తకాలు ఈ నెల 10వ తేది అందజేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ కె.అరివొళి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 2024-25 విద్యా సంవత్సరానికి అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ సాయం పొందుతున్న ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూ, పాదరక్షలు, యూనిఫాం, రంగుల పెన్సిల్స్, సైకిల్, జామెంట్రీ బాక్స్ సహా పలు విద్యా ఉపకరాణాలు అందించనున్నామన్నారు. పాఠశాలలు సోమవారం ప్రారంభమైన రోజునే పాఠ్యపుస్తకాలు, చరిత్ర మ్యాప్ తదితరాలు ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 70,67,094 మంది విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, 60,75,315 మందికి నోటు పుస్తకాలు, 8,22,603 మంది చరిత్ర మ్యాప్‌లు అందించనున్నామని పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.

అలల ధాటికి కూలిన వంతెన



కూలిన చేపల దిగుమతి వంతెన

ఐసిఎఫ్, జూన్ 8: రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని ధనుష్కోటిలో బలంగా వీచిన గాలులతో అలల ఉధృతి ఏర్పడి రూ.7 కోట్లతో నిర్మించిన చేపల దిగుమతి వంతెన కూలిపోయింది. నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చడంతో రామేశ్వరం, ధనుష్కోటి, పాంబన్ ప్రాంతాల్లో ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. ధనుష్కోటిలో ఉన్న ముకుందరాయర్ సత్రం సముద్రతీరంలో రూ.7 కోట్ల వ్యయంతో 2017లో 100 మీటర్ల పొడవైన చేపల దిగుమతి వంతెన నిర్మించారు. ఐదు సంవత్సరాలుగా అందుబాటులోకి రాని ఈ వంతెన శుక్రవారం అలల తాకిడికి 20 అడుగుల మేర కూలిపడింది. దీంతో నాటు పడవలతో చేపల వేటకు వెళ్లడాన్ని జాలర్లు విరమించుకున్నారు.

మేట్టుపాళెయంలో వైద్యమంత్రి 21 కిమీ జాగింగ్

అడయార్, జూన్ 8: కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళెయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం 21 కిలోమీటర్ల మేరకు జాగింగ్ చేశారు. శనివారం ఉదయం 5 గంటలకు స్థానిక కాట్టూరు రైల్వే గేట్ నుంచి తన జాగింగ్ ప్రారంభించిన మంత్రి సుబ్రమణ్యం... వనభద్ర కాళి అమ్మన్ ఆలయం, తేక్కంపట్టి, సాలైవేంబు, కండియూర్, వెల్లియంకాడు మీదుగా తేలంపాళెయం వరకు 21 కిలోమీటర్ల దూరం జాకింగ్ చేశారు. ఆ సమయంలో ఆయా గ్రామాల్లోని ఆరోగ్య పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత కోయంబత్తూరులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వివిధ రకాలైన భవనాలకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు.

12న మేట్టూరు డ్యాం జలాల విడుదల కష్టమే...!

మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం

పెరంబూర్, జూన్ 8: కురువై సాగుకు మేట్టూరు డ్యాం నుంచి ఈ నెల 12వ తేది నీటిని విడుదల చేసే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తెలిపారు. డెల్టా జిల్లాల్లో కురువై సాగుకు మేట్టూరు డ్యాం నుంచి జూన్ 12వ తేది నీటిని విడుదల చేస్తుంటారు. కానీ, ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం తక్కువగా ఉంది. ఈ విషయమై మంత్రి పన్నీర్ సెల్వం మాట్లాడుతూ... ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తక్కువగా ఉండడంతో పంటలకు నష్టం కలిగే అవకాశం లేదన్నారు. అయినా, వర్షాలతో దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. మేట్టూరు డ్యాంలో నీటిమట్టాలు తక్కువగా ఉండడంతో ఈ ఏడాది యధావిధిగా ఈ నెల 12న సాగు నీరు విడుదల చేసే అవకాశం తక్కువగా ఉందన్నారు. వర్షాలు కురిసి డ్యాంలో నీటిమట్టాలు పెరిగిన తర్వాత పరిస్థితులు సమీక్షించి నీటి విడుదలకు చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.

ఆనమలై పులుల సంరక్షణ కేంద్రంలో 13 లక్షల విత్తనాల బంతులు చల్లే పనులు ప్రారంభం

ప్యారీస్, జూన్ 8: కోవై జిల్లా పొల్లాచ్చి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఆనమలై పులుల సంరక్షణ కేంద్రంలో 150 హెక్టార్ల విస్తీర్ణంలో కళాశాల విద్యార్థుల ద్వారా 13 లక్షల విత్తనాల బంతులు చల్లే పనులను శనివారం ప్రారంభించినట్లు ఆ కేంద్రం డైరెక్టర్ రామసుబ్రమణ్యం తెలిపారు. ఆనమలై పులుల సంరక్షణ కేంద్రం సహా పొల్లాచ్చి మండల పరిధిలోని తమ్మపదిలో ఉన్న 120 హెక్టార్ల విస్తీర్ణంలో, సర్కార్‌పతి ప్రాంతంలోని 30 హెక్టార్ల విస్తీర్ణంలో పెరిగిన నల్ల తుమ్మ చెట్లు ఇటీవల తొలగించి వాటి స్థానాల్లో కొత్తగా చెట్లు పెంచేందుకు విత్తనాల బంతులు చల్లేందుకు అటవీ శాఖ నిర్ణయించిందని ఆయన తెలిపారు. తాటి, చింత, చందనం, మర్రి, వేప, మామిడి తదతర చెట్ల రకాల విత్తనాలను సేకరించి సుమారు 13 లక్షలకు పైగా తయారుచేసిన విత్తనాల బంతులను కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెర్లు, స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధుల ద్వారా చల్లిస్తున్నట్లు తెలిపారు. రహదారి మార్గం అందుబాటు లేని ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా విత్తనాల బంతులు చల్లేందుకు చర్యలు చేపట్టినట్లు పొల్లాచ్చి ఫారెస్ట్ రేంజర్ పుహళేంది తెలిపారు. టాప్‌స్లిప్ అడవుల్లో 60 మందికి పైగా అటవీ శాఖ అధికారులు ఈ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

78,800 మెట్రిక్ టన్నుల ఎరువులు, పురుగుల మందుల నిల్వ

మంత్రి పెరియకరుప్పన్

ప్యారీస్, జూన్ 8: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు సహకార శాఖ నిర్వహణలోని ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల్లో నిల్వ ఉన్నాయని ఆ శాఖ మంత్రి కేఆర్ పెరియకరుప్పన్ తెలిపారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు రైతులు లబ్దిపొందే విధంగా ఒక్కొక్క పంట సీజన్‌లో సహకార శాఖ ద్వారా రుణాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ కోసం 78,800 మెట్రిక్ టన్నుల ఎరువులు, యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్‌లను ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల్లో స్టాకు ఉంచినట్లు తెలిపారు. ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు సకాలంలో పంపిణీ చేసేలా బఫర్ గోడౌన్‌లలో నిల్వవుంచిన ఎరువులు, పురుగుల మందులను రైతులు సహకార రుణ సంఘాలకు వెళ్లి పొందే ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

ఓపీఎస్ వర్గం నుంచి వైదొలిగిన జేసీడీ ప్రభాకర్

ప్యారీస్, జూన్ 8: మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్, పుహళేంది, కేసీ పళనిస్వామిలు వైదొలిగారు. ఈ ముగ్గురు శనివారం నగరంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సంయుక్తంగా మాట్లాడారు. ముందుగా జేసీడీ ప్రభాకర్ మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితలు కంటికి రెప్పలా కాపాడిన అన్నాడీఎంకే ప్రస్తుతం పలు చీలికలుగా విడిపోయిందని, పార్టీకి మళ్లీ పూర్వవైభవం కల్పించాలన్న దృష్టితో సమన్వయ కమిటీని ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. చీలిక వర్గాలన్నీ ఏకం కావాలని లక్షలాది మంది అన్నాడీఎంకే కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో అన్నాడీఎంకే కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారని, మరో ఓటమిని తట్టుకోగల స్థితిలో కార్యకర్తలు లేరన్నారు. జాతీయ పార్టీలకు దాసోహం కాకుండా అన్నాడీఎంకేను నడిపించగలిగే నాయకులు ప్రస్తుతం అవసరమని, ఇందుకోసం తాము త్వరలోనే ఈపీఎస్, ఓపీఎస్, శశికళ, టీటీవీ దినకరన్‌లతో భేటీ కానున్నట్లు తెలిపారు. అన్నాడీఎంకేను రాజకీయాల నుంచి తరిమివేసే కుట్ర జరుగుతోందని, పార్టీని కాపాడేందుకు తాము నడుం బిగించామని వారు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



వేలూరు, జూన్ 8: ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో స్థానిక ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీస్ శాఖలో శిక్షణ పొందిన బృహదీశ్వరన్ (710 మార్కులు), తరుణ్ శ్రీవత్సవ్ (701 మార్కులు) సాధించారు. వీరిద్దర్నీ శనివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు శాలువాతో సత్కరించి అభినందించారు. తమ సంస్థలో శిక్షణ పొందిన పలువురు నీట్ పరీక్షలో మంచి మార్కులు సాధించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

81 అసెంబ్లీ స్థానాల్లో రెండో స్థానంలో బీజేపీ

పెరంబూర్, జూన్ 8: రాష్ట్రంలో 81 శాసనసభ స్థానాల్లో బీజేపీ కూటమి రెండవ స్థానంలో నిలిచింది. అదే సమయంలో మూడు నియోజకవర్గాల్లో మొదటి స్థానంలో నిలిచింది. ప్రతిపక్ష అన్నాడీఎంకే కూటమి 10 శాసనసభ నియోజకవర్గాల్లో మాత్రమే రెండవ స్థానంలో నిలిచింది. లోక్‌సభ ఎన్నికల్లో, రాష్ట్రంలోని 39 నియోజకవర్గాలను డీఎంకే కూటమి కైవసం చేసుకుంది. కానీ, గత ఎన్నికలతో పోల్చితే ఓట్ల శాతం మాత్రం అధికారం డీఎంకేకి తగ్గింది. అదే సమయంలో అన్నాడీఎంకే ఓట్ల శాతం కూడా భారీగా తగ్గింది. 39 లోక్‌సభ స్థానాల పరిధిలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 స్థానాల్లో మాత్రమే అన్నాడీఎంకే మొదటి స్థానంలో నిలిచింది. తిరుకోవిలూర్, ఉళుందూర్‌పేట, ఎడప్పాడి, సంగగిరి, పరమత్తివేలూరు, కుమారపాళయం, అరియలూరు, జయంకొండాం, తిరుమంగళం, విరుదునగర్ స్థానాల్లో అన్నాడీఎంకే మొదటి స్థానంలో నిలిచింది. ధర్మపురి జిల్లా పెన్నాగరం, ధర్మపురి, పాపిరెడ్డిపట్టి నియోజకవర్గాల్లో బీజేపీ కూటమిలోని పీఎంకే మొదటి స్థానంలో నిలిచింది. మొత్తం 234 శాసనసభ స్థానాల్లో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా 81 స్థానాల్లో అన్నాడీఎంకేను వెనక్కినెట్టి బీజేపీ కూటమి రెండవ స్థానం చేజిక్కించుకుంది. దక్షిణ జిల్లాల్లోని కొన్ని అసెంబ్లీ స్థానాల్లో అన్నాడీఎంకే నాలుగవ స్థానానికి దిగజారింది. ఆ నియోజకవర్గాల్లో నామ్ తమిళర్ పార్టీ మూడవ స్థానంలో నిలిచింది. మూడింట ఒక శాతం శాసనసభ స్థానాల్లో మూడవ స్థానానికి అన్నాడీఎంకే పడిపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు దిగ్భ్రాంతి చెందుతున్నారు.

పాఠశాలల్లో వసతులపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 8: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో తరగతి గదులు, ప్రాంగణాలు శుభ్రం చేయడం, విద్యార్థులకు మౌళిక వసతుల కల్పన తదితరాలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వసతులపై కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులతో స్థానిక కాట్పాడిలో సన్‌భీమ్ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, ప్రాథమిక విద్య అధికారి దయాలన్, ప్రైవేటు పాఠశాలల అభివృద్ధి అధికారి పళని సరస్వతి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల సర్వే ప్రారంభం

పెరంబూర్, జూన్ 8: రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ భూములను సర్వే చేసే పనులకు రూ.2 కోట్ల కేటాయించినట్లు మంత్రి మస్తాన్ తెలిపారు. స్థానిక వక్ఫ్ బోర్డు భూముల కొలతలు, క్రమబద్ధీకరణ, రీ సర్వేకు సంబంధించిన సమావేశం మంత్రి మస్తాన్ నేతృత్వంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ... స్టాలిన్ ముఖమంత్రిగా మూడేళ్లలో రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలు అమలుచేస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులకు రక్షణ కల్పించేలా, వక్ఫ్ భూములను రీ సర్వే చేయించే పనులకు రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ఒకవేళ వక్ఫ్ భూములు ఆక్రమణలకు గురైతే వాటిని విడిపించేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

మంత్రి తంగం తెన్నరసు

పెరంబూర్, జూన్ 8: వర్షాకాలంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. నగరంలో శనివారం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో విద్యుత్ వినియోగం అధికమైందన్నారు. వినియోగం అధికమైనా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేశామన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓవర్ లోడ్, విద్యుత్ సాధనాల్లో ఏర్పడిన మరమ్మతుల కారణంగా అక్కడక్కడా విద్యుత్‌సరఫరా నిలిచిపోయిందన్నారు. అలాంటి ప్రాంతాల్లో సత్వరం మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా మరమ్మతులు పూర్తిచేసి సిద్ధంగా ఉండాలని ఇంజనీర్లను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

12 వరకు విద్యార్థుల వివరాల సవరణకు అవకాశం

పెరంబూర్, జూన్ 8: టెన్త్, ప్లస్‌టూపబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థుల వివరాల సవరణకు ఈనెల 12వ తేది వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు పరీక్ష శాఖ డైరెక్టర్ ఎస్.సేతురామవర్మ అన్ని జిల్లా ప్రధాన విద్యాధికారులకు సర్క్యులర్ పంపారు. పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు అందజేసే సర్టిఫికేట్‌లో విద్యార్థి పేరు, తల్లిదండ్రుల పేర్లు తదితరాల్లో తప్పులు దొర్లితే వాటిని సవరించేందుకు అవకాశం కల్పించామన్నారు. అయినా, పలు పాఠశాలల నుంచి సవరణకు దరఖాస్తులు అందుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 12వ తేది వరకు సవరణకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నామని, సంబంధిత విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పరీక్షల శాఖ సూచించింది.

15 వరకు ఓపెన్, ఆన్‌లైన్ కోర్సుల అంగీకారం గడువు పెంపు

పెరంబూర్, జూన్ 8:ఓపెన్,ఆన్‌లైన్ కోర్సులు అంగీకారం కోసం ఉన్నత విద్యా సంస్థలు ఈ నెల 15వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ కోర్సులు ప్రారంభించే విద్యాసంస్థలు యూజీసీ అంగీకారం పొందాల్సి ఉంది. అంగీకారం ఆయా విద్యాసంస్థలు గత మే 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని యూజీసీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 15వ తేది వరకు పొడిగించినట్లు, మరిన్ని వివరాలకు /deb.ugc.ac.in/వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సెక్రటరీ మనీష్ ఆర్.జోజి ఒక ప్రకటనలో తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతి

ఐసిఎఫ్,జూన్8:ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు జిల్లా రెవెన్యూ అధికారులుగా పదోన్నతి పొందారు. కన్నియాకుమారి జిల్లా బీసీ, ఎంబీసీ సంక్షేమ అధికారిగా ఉన్న సుబ్బయ్య జిల్లారెవెన్యూ అధికారిగా పదోన్నతి పొంది చెన్నై హిందూ దేవాదాయ శాఖలో ఆలయ భూముల ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు. తిరుప్పూర్ జిల్లా కలెక్టర్ పీఏ విజయ్‌రాజ్ జిల్లా రెవెన్యూ అధికారిగా పదోన్నతి పొంది చెన్నై భూముల నిర్వహణ కమిషనరేట్‌లో రెవెన్యూ అధికారిగా నియమితులయ్యారు.

అవయవ దానం చేసిన మహిళ : ప్రభుత్వ నివాళి



కాంతామ్మాళ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ కవిత

వేలూరు, జూన్ 8: స్థానిక కాట్పాడి డివిజన్ కలిన్‌జూర్‌కు చెందిన కాంతమ్మాళ్ అనారోగ్యం కారణంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈనేపథ్యంలో, ఈ నెల 6వ తేది ఆమె మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనలతో ఆమె అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో ప్రత్యే శస్త్రచికిత్స ద్వారా కొన్ని అవయవాలు తీసిన వైద్యులు, వాటిని పలు ఆసుపత్రులకు పంపించారు. అనంతరం కాంతామ్మాళ్ మృతదేహానికి వేలూరు రెవెన్యూ తహసీల్దార్ కవిత పూలమాల సమర్పించి నివాళులర్పించారు.

విద్యార్థిని నేత్రాల దానం

వేలూరు, జూన్ 8: గుడియాత్తం భువనేశ్వరిపేటకు చెందిన శివశంకర్ కుమార్తె భువనేశ్వరి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలైంది. ఆమె శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న గుడియాత్తం పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో, కుమార్తె కండ్లు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో, రోటరీ సంఘం అవయవదానం కమిటీ అధ్యక్షుడు ఎం.గోపినాథ్ సలహా మేరకు వేలూరు డా.అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు శనివారం, భువనేశ్వరి నేత్రాలు తొలగించి తీసుకొని వెళ్లారు.

ప్రమాదాల నివారణకు ఎంటీసీ చర్యలు

ఐసిఎఫ్, జూన్ 8: ఎంటీసీ బస్సుల కింద పక్కవాటున ద్విచక్ర వాహనచోదకులు చిక్కుకోకుండా ఉండేలా అడ్డుకంచె ఏర్పాటుచేశారు. ఎంటీసీ ఆధ్వర్యంలో 600లకు పైగా మార్గాల్లో 3,200లకు పైగా బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సుల వల్ల ఏర్పడే ప్రమాదాలను అడ్డుకొనేలా ఎంటీసీ చర్యలు చేపడుతోంది. ముందు జాగ్రత్త చర్యలతో బస్సులు నడపడంపై డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేస్తోంది. అయినప్పటికీ, బస్సుల సమీపంలో వెళ్లే ద్విచక్రవాహనాలు అదుపుతప్పి బస్సు చక్రాల్లో చిక్కుకొని ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని అడ్డుకొనేలా బస్సు రెండు వైపులా కింది భాగంలో అడ్డుకంచె ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడతగా 1,315 బస్సుల్లో వీటిని ఏర్పాటుచేశామని, మిగిలిన బస్సులకు త్వరలో వీటిని అమర్చనున్నామని అధికారులు తెలిపారు.

విషం తాగి దంపతుల ఆత్మహత్య

అడయార్, జూన్ 8: కుమారుడు చేయి చేసుకోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన దంపతులు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోయిల్ ఎన్జీవో కాలనీకి చెందిన రామదురై (67), వెల్లదురైచ్చి (53) అనే దంపతులు ఒక ఫైనాన్స్ కంపెనీని నడుతున్నారు. వీరికి ఒక కుమారుడు ఉండగా జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించడంతో వారిపై దాడి చేసినట్లు స్థానికుల పేర్కొంటున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆ దంపతులు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

టీచర్‌కు ఆరేళ్ల జైలుశిక్ష

ప్యారీస్, జూన్ 8: విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన టీచర్‌కు పోక్సో న్యాయస్థానం ఆరేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. శరవణపాక్కం గ్రామానికి చెందిన వేలు కుమారుడు కృష్ణన్ (37) 2019లో సిరుమాతురై గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు టీచర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ పాఠశాల విద్యార్థిని పట్ల అసభ్యకరంగా కృష్ణన్ ప్రవర్తించడంతో ఆగ్రహించిన గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి ఆయనను పోలీసులకు అప్పగించారు. కేసు నమోదుచేసి అరెస్ట్ చేసిన కృష్ణన్‌ను కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు. విల్లుపురం పోక్సో కోర్టులో జరిగిన విచారణ శుక్రవారం పూర్తికావడంతో న్యాయమూర్తి వినోద.. కృష్ణన్‌కు ఆరేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేలు జరిమానా విధించారు. బాధిత విద్యార్థినికి రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం పంపిణీ చేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

లంక జైలు నుంచి ముగ్గురు జాలర్ల విడుదల

అడయార్, జూన్ 8: శ్రీలంక జైలు నుంచి ముగ్గురు తమిళ జాలర్లు విడుదలయ్యారు. గత యేడాది మే నెల 16వ తేదీన తంజావూరు జిల్లా మల్లిపట్టిణం ప్రాంతంలో రాష్ట్ర జాలర్లు మహేష్ (23), వాంజినాథన్ (25), రంజిత్ (27) అనే ముగ్గురు జాలర్లు సముద్రంలో చేపల వేట కొనసాగిస్తుండగా, శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. ఆ తర్వాత ఆ దేశ కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించింది. ఈ కేసు విచారణ శుక్రవారం జరగ్గా.. ఈ ముగ్గురు జాలర్లను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో ఈ ముగ్గుర్లు జాలర్లకు విముక్తి లభించగా, కొలంబోలోని భారత రాయబార కార్యాలయం సహకారంతో వీరు రాష్ట్రానికి చేరుకున్నారు.

ఏసీబీ వలలో అగ్నిమాపక అధికారి

అడయార్, జూన్ 8: నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.20 వేలు లంచం పుచ్చుకున్న అగ్నిమాపకదళ విభాగం అధికారి శివరాజ్‌ను అవినీతి నిరోధక శాఖ పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు సిద్ధాపతూరు ప్రాంతానికి చెందిన కరుప్పుస్వామి కుమారుడు నవీన్ కోవైలో ఒక కంపెనీ నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈయన తన కంపెనీని విస్తరించేందుకు వీలుగా కోవైలోని సిడ్కో నగర్‌లో దీన్ని నెలకొల్పేందుకు నిర్ణయించారు. ఇందుకోసం అగ్నిమాపకదళ విభాగం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఈ సర్టిఫికెట్ ఇచ్చేందుకు పుదూర్ అగ్నిమాపకదళ కేంద్రంలో పనిచేసే స్టేషన్ ఆఫీసర్ శివరాజ్ రూ.20 వేల లంచం డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని నవీన్ ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు... శివరాజ్‌ను అరెస్టు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఎర్రచందనం స్వాధీనం

వేలూరు, జూన్ 8: గుడియాత్తం సమీపంలో రూ.5 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు, ఒకరిని అరెస్ట్ చేశారు. గుడియాత్తం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కల్లపాడి అడవుల నుంచి కొందరు అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు గుడి యాత్తం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అటవీ సిబ్బంది మొదలియార్ చెరువు ప్రాంతంలో గస్తీ పనులు చేపట్టారు. ఆ సమ యంలో ఓ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలతో ఓ వ్యక్తిని పోలీసులు అదు పులోకి తీసుకున్నారు. అతను కేవీ కుప్పం సమీపం దొరైమూలై ప్రాంతానికి చెందిన మునిరాజ్ (45) అని తెలిసింది. దీంతో, 750 కిలోల బరువున్న 15 దుంగలు స్వాధీనం చేసుకున్న అధికారులు, మునిరాజ్‌ను విచారిస్తున్నారు.

మద్యం మత్తులో పారామిలిటరీ బలగాల వీరంగం

రైలు నుంచి దింపేసిన ఆర్పీఎఫ్ అధికారులు

పెరంబూర్, జూన్ 8: ఎక్స్‌ప్రెస్ రైలులో మద్యం సేవించి ప్రయాణికులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన పారామిలిటరీ సైనికులను ఆర్పీఎఫ్ పోలీసులు రైలు నుంచి దింపివేశారు. స్థానిక సెంట్రల్ నుంచి కేరళకు శుక్రవారం రాత్రి చేరన్ ఎక్స్‌ప్రెస్ రైలు బయల్దేరింది. రైలులోని జనరల్ బోగీలో 20 మంది పారామిలిటరీ సైనికులు ఎక్కారు. రైలు బయల్దేరిన కొద్దిసేపటికి మద్యం సేవిస్తూ కేకలు, కేరింతలు కొట్టసాగారు. వీరి చేష్టలు మితిమీరడంతో కొందరు ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆగడాలు ఆపాలని కోరారు. దీంతో ఆగ్రహం చెందిన సైనికులు ప్రయా ణికులతో వాగ్వివాదానికి దిగి వీరంగం సృష్టించారు. సైనికుల దాడిలో ఓ ప్రయాణికుడికి గాయలు కాగా, ఓ సైనికుడు తుపాకి చూపుతూ ప్రయాణికు లను బెదిరించాడు. ఈలోపు జోలార్‌పేట రైల్వేస్టేషన్‌ను రైలు సమీపిస్తున్న సమయంలో ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగి రైలును నిలిపివేశారు. రైలు ఆగిన వెంటనే ప్రయాణికులు కిందకు దిగి ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు రైలు నుంచి పారామిలిటరీ సైనికులను దింపి వేయాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ వ్యవహారంపై స్పందించిన అధికారులు, బోగీ నుంచి సైనికులను దింపివేశారు.ఈఆందోళనలతో గంట ఆలస్యంగా రైలు బయల్దేరి వెళ్లింది. కాగా, బోగీలో సైనికులు ప్రయాణికులపై విరుచుకు పడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడి వైరల్‌గా మారాయి.

కోవైలో 2.5లక్షలకు పసిబిడ్డ అమ్మకం

రైతు అరెస్టు



రైతు విజయన్

చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం సూలూరులో ఓ పసికందును రూ.2.5 లక్షలకు కొనుగోలు చేసిన రైతును పోలీసులు అరెస్టు చేశారు. సూలూరు వద్ద ఓ హోటల్‌ను నడుపుతున్న బీహార్‌కు చెందిన మహేష్‌కుమార్, అంజలి అనే దంపతులు ఇటీవల తమ స్వస్థలానికి వెళ్లి తిరిగి వస్తూ ఓ పసిబిడ్డను వెంటతీసుకువచ్చి, ఆ బిడ్డను సంతానంలేని దంపతులకు విక్రయించారు. ఈ విషయం తెలియడంతో పోలీసులు ఆ ఇరువురినీ అరెస్టు చేశారు. ఆ దంపతుల వద్ద విచారణ జరిపినప్పుడు పసిబిడ్డను సూలూరు సమీపం తిమ్మనాయకన్ పాళయానికి చెందిన విజయన్ అనే రైతు అని తెలిసింది. ప్రత్యేక దళం పోలీసులు రంగంలోకి దిగి రైతు విజయన్‌ను అరెస్టు చేశారు. బీహార్ దంపతులు తమకు తప్పుడు దస్తావేజులు చూపెట్టి పసిబిడ్డను రూ.2.5లక్షలకు విక్రయించినట్లు రైతు విజయన్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



కోయంబత్తూరులో శనివారం 'నూతన విద్యావిధానం సంస్కరణలు' అంశంపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



వేలూరు ఎంపీగా గెలిచిన కదిర్ ఆనంద్‌ను సత్కరిస్తున్న వేలూరు కార్పొరేషన్ 1వ మండల అధ్యక్షులు పుష్పలత, దక్షిణ ప్రాంత డీఎంకే సెక్రటరీ వన్నియరాజా, 1వ వార్డు కౌన్సిలర్ అన్బు తదితరులు

ఇంజనీరింగ్, మెడిసిన్‌తోపాటు ఎన్నో కోర్సులు!

ఆచితూచి ఎంపిక చేసుకుంటే భవిష్యత్ బంగారమే!







SUNDAY SPECIAL

ప్లస్-2 తర్వాత విద్యార్థులు ఏ కోర్సులు చదవాలి? ఏ చోట చదవాలి? ఏ కోర్సును ఎంపిక చేసుకుంటే ఉద్యోగావకాశాలు లభిస్తాయి? అనే ప్రశ్నలు తలెత్తటం సహజమే. ఇటీవలి కాలంలో విద్యార్థులు ఎక్కువగా ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులలో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఈ రెండు కోర్సులే కాకుండా మరెన్నో కోర్సులు కూడా ఉన్నాయని, వాటిని చదివితే మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలుసుకోలేకపోతున్నారు. వాణిజ్య, వ్యవసాయ, వెటర్నరీ రంగాలకు సంబంధించిన కోర్సులు చదివితే మంచి భవిష్యత్ ఉందనే విషయాన్ని విస్మరిస్తున్నారు. విద్యార్థులు ఆచితూచి తమకు నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకుంటే వారి భవిష్యత్ దేదీప్యమానంగా ఉంటుంది. ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులు చదివితే ఉద్యోగవకాశాలు మెండుగానే లభిస్తాయి. సుమారు 70 శాతం పారిశ్రామిక సంస్థలు ఇంజనీరింగ్ విభాగానికి చెందినవే. కనుక ఇంజనీరింగ్ చదివిన పట్టభద్రులకు డిమాండ్ అధికమని చెప్పవచ్చు. ఈ ఇంజనీరింగ్ కోర్సులను చదివే విద్యార్థులు డిగ్రీ చేతికిరాగానే ఉద్యోగాలు లభించాలంటే చదివేటప్పుడే తమ ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలి. విద్యార్థులు ఏ విభాగాన్ని ఎంపిక చేసుకుంటారో ఆ విభాగంలో ఏర్పడుతున్న తాజా మార్పులను ప్రత్యేకించి సాంకేతిక మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. పాఠ్యాంశాలను ఆచితూచి ఎంపిక చేసుకోవాలి. ప్రస్తుతం ఏ కోర్సులు, ఏ పాఠ్యాంశాలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలి. - ఆంధ్రజ్యోతి, చెన్నై

ఏ కోర్సు మెరుగు ?



ప్రస్తుతం ఇంజనీరింగ్ కోర్సులలో చేరే విద్యార్థుల మొదటి ఛాయిస్ కంప్యూటర్ సైన్స్! ఈ కోర్సును చదివితే భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగాలు లభిస్తుండటమే దీనికి కారణం. ఇదే విధంగా సివిల్ ఇంజనీరింగ్ కోర్సులకు కూడా ఇటీవలి కాలంలో డిమాండ్ పెరిగింది. భారతదేశంలోనే కాకుండా ఆగ్నేయ ఆసియా, ఆఫ్రికా, అరబ్బుదేశాలలో వచ్చే పదేళ్లలో సివిల్ ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగవకాశాలు మెండుగా లభించే అవకాశాలున్నాయి. సాధారణంగా సివిల్ ఇంజనీరింగ్ అంటే ఇళ్లను నిర్మించడం, ప్రజాపనుల శాఖలో ఉద్యోగం అని అపోహపడుతుంటారు. అయితే ఈ విభాగంలో క్యాంటిటీ సర్వేయర్, లేండ్ సర్వేయర్, సైట్ ఇంజనీర్, డిజైన్ ఇంజనీర్, ప్రాజెక్ట్ మేనేజర్, బ్రిడ్జ్ ఇంజనీర్, రోడ్ ఇంజనీర్, జీయో టెక్నాలజికల్ ఇంజనీర్, కమర్షియల్ మేనేజర్ అంటూ పలు ఉద్యోగవకాశాలు ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్...

విద్యార్థులు ఈ కోర్సులను చదువుతున్నప్పుడే ఆ రంగంలో ఏర్పడుతున్న కొత్త మార్పులను, నవీన సాంకేతిక పద్ధతులను గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇదేవిధంగా మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులు చదివే విద్యార్థులకు కూడా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగవకాశాలు మెండుగా ఉన్నాయి. పారిశ్రామిక కర్మాగారాలు, కార్ల తయారీ సంస్థలు, ఆటోమొబైల్ పరికరాలను ఉత్పత్తి చేసే కర్మాగారాలలో ఉద్యోగవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇవికాక ఎన్ఎల్‌సి, ఓఎన్‌జీసీ వంట ప్రభుత్వ రంగ సంస్థలలోనూ అసిస్టెంట్ ఇంజనీర్ హోదాలో మంచి ఉద్యోగాలు లభిస్తాయి. దీనికి గేట్ ప్రవేశపరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఆర్‌డీఓ, ఇస్రో వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలలోనూ ఉద్యోగవకాశాలు ఉన్నాయి. ఇదే విధంగా ఇటీవలి కాలంలో విద్యార్థులు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాల ఉపయోగం అధికం కావటమే దీనికి కారణం. ఎలక్ట్రానిక్ రంగాలలో మంచి ఉద్యోగాలు సంపాదించాలంటే ఈసీఈ కోర్సును ఎంపికచేసుకోవచ్చు. అంతే కాకుండా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ కోర్సు చదివినా దేశ విదేశాల్లో మంచి ఉద్యోగాలు లభిస్తాయి. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ వంటి ఉన్నత సంస్థలలోనూ ఉద్యోగాలు పొందవచ్చు. ప్రస్తుతం దేశమంతటా విండ్‌మిల్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి, సూర్యరశ్మిద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండటంతో ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు ఈ రెండు విభాగాలలో మంచి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. దీనితోపాటు రోబోటిక్స్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ తదితర రంగాలలోనూ ఉద్యోగవకాశాలు మెండుగా ఉన్నాయి.

మెడిసిన్

రాష్ట్రంలో వైద్య కోర్సులలో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతియేటా విపరీతంగా పెరుగుతోంది. ఎంబీబీఎస్ కోర్సులలో చేరేందుకు రాష్ట్రంలో 38 ప్రభుత్వ వైద్యకళాశాలలు ఉన్నాయి. రెండు దంత వైద్య కళాశాలలు కూడా ఉన్నాయి. ఇవికాక 19 ప్రైవేటు వైద్యకళాశాలలు, 19 ప్రైవేటు దంత వైద్యకళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో చేరాలంటూ నీట్ పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలి. ఇవికాక ప్రస్తుతం ఆయుష్ విద్యా కోర్సులు కూడా ఉన్నాయి. బీఎస్ఎంఎస్ (సిద్ధ), బీఏఎంఎస్ (ఆయుర్వేదం), బీహెచ్ఎంఎస్ (హోమియోపతి), బీయుఎంఎస్ (యునాని), బీఎన్‌వైఎస్ (నేచురల్ మెడిసిన్ అండ్ యోగా సైన్స్) కోర్సులను ఎంపిక చేసుకుని విద్యార్థులు వైద్య వృత్తిని చేపట్టవచ్చు.

అగ్రికల్చర్ కోర్సులు...

వైద్యకోర్సులు లభించని విద్యార్థులు అగ్రికల్చర్ కోర్సులలో చేరటం ఆనవాయితీగా ఉంటోంది. ఈ కోర్సులలో అడ్మిషన్లు ప్లస్-2 మార్కుల ఆధారంగా, కౌన్సెలింగ్ ద్వారా జరుగుతాయి. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 14 రకాల నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను అందిస్తోంది. ముఖ్యంగా బీఎస్సీ (అగ్రికల్చర్) బీఎస్సీ (హార్టికల్చర్), బీఎస్సీ (ఫారెస్ట్రీ), బీఎస్సీ (ఫుడ్, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, బీఎస్సీ సిరికల్చర్ బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీటెక్ (ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్) కోర్సులను చదివితే మంచి ఉద్యోగవకాశాలు లభిస్తాయి.

నర్సింగ్ కోర్సులు...

ప్లస్-2 ఉత్తీర్ణులైన విద్యార్థినులలో చాలా మంది నర్సింగ్ కోర్సులను ఎంపిక చేసుకోవటం ఇటీవలి కాలంలో అధికంగా ఉంటోంది. నర్సింగ్ కోర్సులు చదివితే దేశవిదేశాల్లో ఉద్యోగవకాశాలు లభిస్తాయి. భారతదేశంలో రోగుల నిష్పత్తికి సరిపడా నర్సుల పోస్టులు లేకపోవడం వల్ల వైద్య రంగంలో నర్సుల పోస్టులకు మంచి డిమాండ్ ఉంది. రాబోవు సంవత్సరాలలో ఆరులక్షలకు పైగా నర్సుల పోస్టులు అవసరమవుతాయని చెబుతున్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు, మూడేళ్ల నర్సింగ్ డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

వెటర్నరీ, ఫిషరీస్...

ఇక ప్లస్-2 మార్కుల ఆధారంగా వెటర్నరీ మెడికల్ కోర్సులలో అడ్మిషన్లు జరుగుతాయి. ప్రభుత్వ పశు సంవర్ధక వైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న వెటర్నరీ కళాశాలల్లో ఐదున్నర సంవత్సరాల వెటర్నరీ డిగ్రీ కోర్సులు, నాలుగున్నర సంవత్సరాల బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ పౌల్ట్రీ టెక్నాలజీ వంటి కోర్సులలోను చేరవచ్చు. ఇదేవిధంగా మత్స్యశాఖలోను బీఎఫ్ఎస్సీ, బీటెక్ ఫిషరీష్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ బయోటెక్నాలజీ, బీటెక్ షిషరీస్ అంట్ నాటికల్ టెక్నాలజీ వంటి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.ఈ కోర్సులు చదివే విద్యార్థులకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుంది.

కామర్స్ కోర్సులు...

కామర్స్ డిగ్రీ కోర్సులు చదివి అదనంగా కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పట్టభద్రులకు కూడా మంచి ఉద్యోగవకాశాలు ఉన్నాయి. బికామ్ చదువుతున్నప్పుడే విద్యార్థులు కంప్యూటర్ డిప్లొమా కోర్సులు కూడా అభ్యసిస్తే ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగాలు లభిస్తాయి.

ఇతర కోర్సులు...

వైద్య రంగంలో సాధించాలనుకునే విద్యార్థులు నాలుగేళ్ల బీఫార్మ్ కోర్సులో చేరవచ్చు. ఫిజియోథెరఫీ,, సైకాలజీ కోర్సులను చదివితే కూడా ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. క్రీడా రంగంలో ఆసక్తికలిగినవారు మూడేళ్ల ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్, రెండేళ్ల ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులలో చేరవచ్చు. ఇవిగాక బీఎస్సీయోగా, స్పోర్ట్స్ సైకాలజీ వంటి కోర్సులు చదివినా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. న్యాయవ్యవస్థపై ఆసక్తి కలిగినవారు ఐదేళ్ల లా కోర్సును అభ్యసించవచ్చు. ఇవికాక హోటల్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, మేనేజ్‌మెంట్, విజువల్ కమ్యూనికేషన్, బీఎస్సీ ఆర్ట్స్ అండ్ సైన్స్ వంటి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. తమకు నచ్చిన డిగ్రీ కోర్సులను ఎంపిక చేసుకున్న విద్యార్థులు ఆ కోర్సులను చదువుతున్నప్పుడే తమ రంగాలలో చోటుచేసుకుంటున్న మార్పులను గమనించి, తగు ప్రతిభాపాటవాలను కూడా పెంపొందించుకోవాలి. అప్పుడే ఈ పోటీ యుగంలో మంచి ఉద్యోగాలను పొందటానికి వీలవుతుంది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నటి కీర్తి శంతను

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం

అడయార్, జూన్ 8: స్థానిక తిరువాన్మియూరులో జాతీయ హస్తకళ, చేనేత వస్త్ర ప్రదర్శనను నటి కీర్తి శంతను ప్రారంభించారు. తిరువాన్మియూరులోని సీఈఆర్‌సీ క్యాంపస్ ఎగ్జిబిషన్ మైదానంలో ఈ నెల 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎందరో ప్రతిభావంతులైన హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు, దుస్తులు, ఉపకరణాలు, గృహ సౌందర్య సాధనాలు, బ్యాగులు, ఫర్నీచర్ ఇలా అన్ని రకాల వస్తువులను ఇందులో ప్రదర్శనలో ఉంచారు. కుటుంబ సమేతంగా చేసేందుకు, వస్తువులు కొనుగోలు చేసేందుకు ఈ ప్రదర్శన నగర వాసులకు గొప్ప అవకాశమని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ప్రదర్శనను ప్రారంభించిన నటి కీర్తి శంతను మాట్లాడుతూ, ఈ అద్భుతమైన ప్రదర్శనను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తర భారతదేశంలో లభించే అన్ని రకాల వస్తువులు ఈ ప్రదర్శనలో విక్రయానికి అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

పల్లవుల కాలం నాటి విగ్రహం లభ్యం

ఐసిఎఫ్, జూన్ 8: విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూర్ యూనియన్ పయ్యూరు గ్రామం నుంచి సేత్తారి వెళ్లే మార్గంలో ఓ అరటి తోట సమీపంలో పల్లవుల కాలం నాటి మురుగన్ విగ్రహం లభించినట్లు మద్రాసు విశ్వవిద్యాలయ శైవ సిద్ధాంత శాఖ విద్యార్థి అలెక్స్ తెలిపారు. నగరంలోని ప్రపంచ తమిళ పరిశోధన సంస్థలో శిలాశాసనాలు, పురావస్తు కోర్సు పూర్తిచేసి ప్రస్తుతం మద్రాసు విశ్వవిద్యాలయంలో వైష్ణవ సిద్ధాంతం చదువుతున్నారు. సెలవు రోజుల్లో పురావస్తు పరిశోధనలు చేపడుతుంటారు. ఇటీవల పయ్యూరు ప్రాంతంలో ఓ చెట్టును ఆనుకొని ఉన్న రాతి విగ్రహాన్ని గుర్తించి దానిని పరిశోధించారు. ఈ విగ్రహం పల్లవుల కాలమైన 8-9 శతాబ్దానికి చెందిన మురుగన్ విగ్రహమని తెలిపారు. విగ్రహం ఎత్తు 60 సెంమీ, వెడల్పు 19 సెం.మీ కలిగి ఉందని, తామర పూవుపై నిల్చున్న భంగిమలో, తలపై ఆడ దేవతలు ధరించే మకుటాన్ని కలిగి ఉన్నాడని, కుడివైపున పై భాగంలో కోడిపుంజు, ఎడమవైపు పై చేయిన వజ్రాయుధం, దాని పక్కన వేలాయుధం, కుడివైపు కింది చేయి అభయ హస్తంలోను, ఎడమ కింది చేయి నడుంపై ఉంచిన భంగిమలో ఉందన్నారు.



మురుగన్ విగ్రహం

బోనులో చిక్కిన చిరుత



పెరంబూర్, జూన్ 8: నీలగిరి జిల్లా కూడలూరు సమీపం దేవర్‌సోలై ప్రాంతంలో ప్రజలను భయభ్రాంతులను చేస్తున్న చిరుత పులి అటవీ శాఖ ఏర్పాటుచేసిన బోనులో చిక్కింది. దేవర్‌సోలై ప్రాంతంలోని దేవన్ ఎస్టేట్, పరిసర గ్రామాల్లోని జనావాస ప్రాంతాల్లో కొన్ని రోజులుగా చిరుత సంచరించడం కలకల రేపింది. జన నష్టం జరుగముందే చిరుతను బంధించాలని ఆయా ప్రాంతాల ప్రజలు అటవీ శాఖకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారులు గత బుధవారం నుంచి ఆ ప్రాంతంలో ప్రత్యేక గస్తీ చేపట్టారు. అలాగే, ఆ ప్రాంతంలో ఇనుప బోను ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం బోనులో చిరుత పులి చిక్కుకుంది. ఈ చిరుతను అడవిలోకి పంపాలా, జూకు తరలించా అనే విషయమై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని జిల్లా అధికారులు తెలిపారు.

దివ్యాంగ చిన్నారులకు 'బాలాజీ దర్శనం'



ఎస్. మహావీర్ చంద్ బోత్రా

అడయార్, జూన్ 8: రోటరీ ఇంటర్నేషనల్ 3233 (ఆర్ఐ3233) చరిత్రలోనే తొలిసారి 'శ్రీ బాలాజీ దర్శనం - కడవులిన్ కుళందైగలోడు' పేరుతో స్పెషల్ చిల్డ్రన్స్ కోసం ప్రత్యేక రైలును నడుపనుంది. వచ్చే ఆగస్టు 5వ తేదీన ఈ ప్రత్యేక రైలు సాయంత్రం 3 గంటలకు చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి రేణిగుంట స్టేషన్‌కు చేరుకోనుంది. ఈ రైలులో ప్రయాణించే దివ్యాంగ చిన్నారులను చూసుకునేందుకు వీలుగా వలంటీర్లను నియమించనున్నారు. చిన్నారులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాన్ని అందజేస్తారని, స్పెషల్ చిల్డ్రన్స్ కోసం ఈ తరహా ప్రత్యేక రైలును నడపడం రోటరీ ఇంటర్నేషనల్ చరిత్రలో ఇదే తొలిసారి అని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ ఎస్. మహావీర్ చంద్ బోత్రా, బాలాజీ దర్శన్ కమిటీ ఛైర్మన్ పంకజ్ కంకారియాలు శనివారం విడుదల చేసిన ప్రత్యేక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలులో సుమారుగా 1500 మంది దివ్యాంగ చిన్నారులు ప్రయాణిస్తారని వారు తెలిపారు. పూర్తి వివరాల కోసం కృష్ణ అనే వ్యక్తిని 94983 58607 అనే మొబైల్ నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

తూత్తుకుడిలో నిర్లవణీకరణ కేంద్రం

ప్యారీస్, జూన్ 8: తూత్తుకుడిలో మొట్టమొదటిసారిగా సముద్రపు జలాలను తాగునీరుగా మార్చే పథకాన్ని అమలుపరిచేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ముల్లకాడు గ్రామంలో రూ.904 కోట్ల వ్యయంతో నిర్లవణీకరణ కేంద్రం ఏర్పాటుకానుంది. ప్రైవేటు సంస్థ భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలుపరచనున్నట్లు రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని, వర్షాకాలంలో తాగునీటి కొరత తీర్చేలా ఈ పథకాన్ని ప్రభుత్వం రూపొందించిందని, దీనికి సంబంధించిన నమూనాను కూడా శనివారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.



నిర్మితం కానున్న ప్లాంట్ నమూనా

వీరాణం చెరువులో పెరిగిన నీటిమట్టం



చెన్నై, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వీరాణం చెరువులో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. కాట్టుమన్నార్‌కోవిల్ ప్రాంతంలోని వీరాణం చెరువు ఆయకట్టు కింద 45 ఎకరాల విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నారు. అదే సమయంలో ఆ చెరువు నుండి నగరానికి మంచినీటిని పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. గతేడాది చాలినంత రుతుపవన ప్రభావిత వర్షాలు కురవని కారణంగా ఈ యేడాది వేసవికి ముందే గత ఫిబ్రవరిలో వీరాణం చెరువులో నీరు అడుగంటింది. దీనితో నగరానికి మంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వీరాణం చెరువులో ఇన్‌ఫ్లో అధికమవుతూ వచ్చింది. ఈ చెరువులో 1465 ఘనపు టడుగుల మేర నీటిని నిల్వ చేయడానికి వీలుండగా, ప్రస్తుతం 640 ఘనపు టడుగుల మేరకు నీటిమట్టం పెరిగింది. దీనితో నగరానికి మళ్లీ పైప్‌లైన్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. గత రెండు రోజులుగా చెరువు సమీప ప్రాంతాల్లోనూ చెదురుముదురుగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులోకి అదనపు జలాలు ప్రవేశిస్తున్నాయని నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.



మీడియాపై నమ్మకంతో హీరోగా మారిన నిర్మాత

... 'పితా' ఆడియో రిలీజ్

చిత్రజ్యోతి

సాధారణంగా హీరోలు నిర్మాతలుగా సినిమాలు నిర్మించడం ఆనవాయితీ. అయితే తమిళ సినీ నిర్మాత మదియళగన్ మాత్రం మీడియాపై అపరిమితమైన నమ్మకం పెట్టుకుని హీరోగా మారినట్టు చెప్పారు. ప్రస్తుతం తనను గట్టెక్కించాల్సిన బాధ్యత మీడియాదేనని అన్నారు. శ్రీనిక్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాతలు డి.బాలసుబ్రమణి, సి.సతీష్ కుమార్‌లు కలిసి నిర్మించిన మూవీ 'పిత'. రచన, దర్శకత్వం వి.కార్తీక్ కుమార్. వి.మది (మదియళగన్), వనిత విజయకుమార్, శరవణ సుబ్బయ్య తదితరులు నటించారు. ఫ్రాంక్లిన్ రిచర్డ్ ఛాయాగ్రహణం అందించగా, రషాంత్ అర్విన్ సంగీతం సమకూర్చారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను శుక్రవారం రాత్రి నగరంలో రిలీజ్ చేశారు. ఇందులో హీరో మదియళగన్ మాట్లాడుతూ, 'ఒక నిర్మాతగా ఈ వారంలోనే మూడు నాలుగు సినిమా ఈవెంట్స్ ఈ ప్రసాద్ ల్యాబ్‌లోనే నిర్వహించాను. ఇపుడు హీరోగా మారాను. కేవలం మీడియాపై ఉండే నమ్మకంతోనే.ఇప్పటివరకు అన్ని సినిమాలకు అండగా నిలిచారు. కానీ, ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డైడ్ అనే రీతిలో నా పరిస్థితి ఉంది. ఈ సినిమా కథలో ఎల్టీటీఈ చీఫ్ దివంగత వేలుపిళ్లైను తప్పుగా చిత్రీకరించలేదు. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని కథాంశాన్ని ఎన్నుకున్నాం. ఖచ్చితంగా ప్రతి ఒక్క తల్లిదండ్రులు ప్రశంసిస్తారు. ఒక నిర్మాతగా 11 సినిమాలు నిర్మించాను. ఇపుడు హీరోగా మారాను. సినిమాల ఓపెనింగ్స్ ఆశాజనకంగా లేకపోయినప్పటికీ హీరోలు మాత్రం రూ.కోట్లలో రెమ్యునరేషన్ అడుగుతున్నారు. అందుకే నటుడుగా మారి ఒక చిత్రంలో నటించాను. ప్రతి ఒక్కరినీ ఆలరిస్తుంది' అని పేర్కొన్నారు. నటి వనిత విజయకుమార్ మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరి జీవితాల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. పరీక్షలు, ప్రేమ విఫలమైతే ఆత్మహత్యలు చేసుకోవడం సరైన చర్య కాదు. ఒక సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు. ఇందులో నా క్యారెక్టర్ నచ్చడంతో సమ్మతించాను' అని పేర్కొన్నారు. దర్శకుడు కార్తీక్ కుమార్ మాట్లాడుతూ, 'ఒక మంచి అవకాశాన్ని ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు. చాలా మంది సినిమా రంగం తర్వాత ఇతర వ్యాపారాల్లోకి వెళుతుంటారు. కానీ, మదియళగన్ హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. అతనితో అద్భుతమైన టాలెంట్ ఉంది. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు. నిర్మాత ధనుంజయన్, నటి లక్ష్మీనారాయణన్, రాజకీయనేత నాంజిల్ సంపత్‌తోపాటు చిత్రయూనిట్ సభ్యులు ప్రసంగించారు.

కోలీవుడ్‌లో జోష్

5 నెలల్లో 110 చిత్రాల విడుదల



'అరణ్మనై-4'లో తమన్నా, రాశీఖన్నా

గత యేడాదితో పోల్చుకుంటే ఈ యేడాది తమిళ చిత్ర పరిశ్రమలో కొత్తగా విడుదలయ్యే సినిమాల సంఖ్య గణనీయంగా పెరిగింది.గత ఐదు నెలల్లోనే ఏకంగా 110 సినిమాలు విడుదలయ్యాయి. 2024 సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి శుక్రవారం కనీసం నాలుగు, ఐదు చిత్రాలకు తగ్గకుండా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. కొన్ని శుక్రవారాల్లో ఈ చిత్రాల సంఖ్య ఏడు, ఎనిమిది వరకు ఉంటున్నాయి. అయితే, గత ఐదు నెలల్లో విడుదలైన సినిమాల సంఖ్య వందకు పైగా ఉన్నప్పటికీ.. వాటిలో వసూళ్ళ పరంగా ఘన విజయం సాధించిన చిత్రాల సంఖ్యను మాత్రం వేళ్ళపై లెక్కించవచ్చు. జనవరి నెల నుంచి ఏప్రిల్ వరకు మొత్తం 87 సినిమాలు విడుదలకాగా, ఒక్క మే నెలలోనే ఏకంగా 23 కొత్త చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. దీంతో ఈ యేడాది ఇప్పటివరకు మొత్తం విడుదలైన చిత్రాల సంఖ్య 110గా ఉంది. వీటిలో 89 చిత్రాలు చిన్న బడ్జెట్ మూవీలు ఉన్నాయి. ఇందులో 'అరణ్మనై-4', 'లవర్, 'స్టార్' వంటి హిట్ చిత్రాలు ఉన్నాయి. ఇదే ట్రెండ్ ఈ యేడాది ఆఖరు వరకు కొనసాగితే మాత్రం... ఈ సంవత్సరం విడుదలయ్యే మొత్తం సినిమాల సంఖ్య సుమారుగా 280 వరకు ఉండొచ్చు. సాధారణంగా డిసెంబరు నెలలో అధిక సంఖ్యలో సినిమాలు విడుదలవుతుంటాయి. అందువల్ల ఈ సంఖ్య 300 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అయితే, రానున్న ఆరు నెలల్లో అత్యధిక చిత్రాలు విడుదల చేయడం పెద్ద సమస్య కాదని, ఆయా నిర్మాతలు నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టాయా? లేదా? అన్నదే ఇపుడు ప్రధాన సమస్య అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

విజయ్ బర్త్‌డేకి రెండు చిత్రాలు రీరిలీజ్



'పోకిరి'లో విజయ్, ఆసిన్

అగ్రనటుడు విజయ్ తన 50వ పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 22వ తేదీన జరుపుకోనున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని గతంలో ఆయన నటించిన రెండు పాత చిత్రాలను మళ్ళీ రిలీజ్ చేస్తున్నారు. వీటిలో 'తుపాకీ', 'పోకిరి'లు ఉన్నాయి. ఇటీవల విడుదలైన 'గిల్లీ' చిత్రం కొత్త చిత్రాలతో పోటీ పడుతూ మంచి కలెక్షన్లను రాబట్టడమేకాకుండా, ఏకంగా అర్థ శతదినోత్సవాన్ని జరుపుకుంది. దీంతో ఆయన నటించిన హిట్ చిత్రాలను రీరిలీజ్ చేసేందుకు ఆయా నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఈ కోవలోనే 'పోకిరి', 'తుపాకీ' చిత్రాలను రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేశారు. విజయ్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో 2012లో వచ్చిన 'తుపాకీ'... ఆ రోజుల్లో విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్ళు రూ.100 కోట్లను రాబట్టిన తొలి చిత్రంగా నిలిచింది. అలాగే, ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా దర్శకత్వం వహించిన చిత్రం 'పోకిరి'. ఇది కూడా సూపర్‌హిట్ మూవీగా నిలిచింది. ఇపుడు ఈ రెండు సినిమాలను జూన్ 21వ తేదీన విడుదల చేస్తున్నారు.

రాఘవ లారెన్స్ దర్శకత్వంలో 'కాంచన-4'



తమిళ చిత్ర పరిశ్రమలోని స్టార్ హీరోల్లో రాఘవ లారెన్స్ ఒకరు. ఈయన గతంలో నటించిన 'కాంచన' చిత్రానికి సీక్వెన్స్‌గా నాలుగో భాగాన్ని తెరకెక్కించనున్నట్టు తాజాగా ప్రకటించారు. స్వయంగా దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా నటించనున్నారు. గత యేడాది 'జిగర్‌తండా డబుల్ ఎక్స్' వంటి హిట్ చిత్రాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అలాగే, సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించే 'కూలీ' చిత్రంలోనూ ఆయన ఓ ముఖ్య పాత్రను పోషించనున్నారు. ఈ నేపథ్యంలో 'కాంచన-4' చిత్రాన్ని రూపొందించనున్నట్టు ప్రకటించారు. రాఘవేంద్ర ప్రొడక్షన్స్ బ్యానరుపై ఈ మూవీని రూపొందించే ఈ చిత్రం షూటింగ్ వచ్చే సెప్టెంబరులో ప్రారంభంకానుంది.